క్లుప్తంగా

సవారమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభం



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ దేవత ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆయల నిర్వాహకులు అమ్మవారి ఆలయం ముందు పందిరి వేసి జాతరను ప్రారంభించారు. వేకువజామునే సమీపంలో ఉన్న కృష్ణానదికి వెళ్లి పవిత్ర జలాలను జల్లి బిందెలతో తీసుకొచ్చి అమ్మవారి మూల విరాట్‌ను అభిషేకించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణతో పాటు కోళ్లు, పోటేళ్లు బలిచ్చి భక్తులు మొక్కులను తీర్చుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన తాగునీటి వసతిని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, హన్మంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతంగా రాణించాలి



వనపర్తి రూరల్: మండలంలోని అంకూర్ గ్రామానికి చెందిన గౌర్ల బాలకిష్టమ్మ కుమార్తె గౌర్ల మాధవి ఉమ్మడి జిల్లా టాపర్‌గా నిలిచి వార్డెన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారు. అదే గ్రామానికి చెందిన పానుగంటి నరసింహ కుమార్తె నందిని బుద్దారం గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీలో 467 మార్కులు సాధించింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం గ్రామంలో వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, డేగ మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చిట్యాల రాము, భగవంతు యాదవ్, రాజేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రమేష్ నాయక్, అంజి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గోపాల్‌పేట: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని రేవల్లి మండల హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం తల్పునూరు శివారులో ఇసుక ట్రాక్టర్ పట్టుకొని సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. ఎలాంటి అనుమతులు చూపించకపోవడంతో ట్రాక్టర్ ఓనర్ కం డ్రైవర్ గుబ్బల సాయిరాంపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేశామని హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

మళ్లీ కూలిన సీలింగ్



అమరచింత: మున్సిపల్ కార్యాలయ భవనానికి ఏర్పాటు చేసిన సీలింగ్ పెచ్చులూడినట్లుగా ఊడి కిందపడుతోంది. అప్పట్లో పీఏసీఎస్ గోదాంను మున్సిపల్ కార్యాలయంగా మార్చేందుకు సుమారు రూ.35 లక్షలతో మరమ్మతులు చేస్తూ పై కప్పుకు సీలింగ్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు పర్యాయాలు సీలింగ్ ఊడి పడిన ఘటనలు మరువక ముందే మరోమారు సీలింగ్ ఊడి పడటంతో సిబ్బంది భయాందోళనలో విధులు హాజరవుతున్నారు. నాసిరకం పనులు చేయడంతోనే ఇలా జరుగుతుందని, అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నంబావి: రెండు రోజుల క్రితం మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బీజేపీ నాయకుడు మేకల చెన్నయ్య గుడిసె మంటల్లో కాలిపోవడంతో బాధిత కుటుంబాన్ని కొల్లపూర్ బీజేపీ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకల చెన్నయ్యయాదవ్ గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైందా.. లేక ఎవరైనా కావాలని చేశారా తేల్చాల్సింది పోలీసులే అని అన్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో బొగ్గు కురుమయ్య, సంపత్‌కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. ఆగమాగం



సూగూర్‌లో ధాన్యంపై నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న రైతు

- తడిసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

వనపర్తి రూరల్: అకాల వర్షం మరోసారి అన్నదాతను ఆగం చేసింది. ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చి.. అక్కడే అరబోశారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యంపై కప్పడానికి సరిపడా కవర్లు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పండిన పంటలో వనపర్తి మండలంలోని కేంద్రాల్లో దాదాపు 70 శాతం ధాన్యం మిల్లులకు చేరింది. కానీ శ్రీరంగాపురం మండలంలో 80 శాతం ధాన్యం ఇంకా కేంద్రాల్లో ఉంది. లారీలు రాక ధాన్యం సేకరించడం లేదని నిర్వాహకులు చెప్తున్నారు. జానంపేటలో కోతలు పూర్తయి 30 రోజులు అయినా 80 శాతం ధాన్యం గ్రామంలో ఉంది. దీంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం కాంటా చేయాలని రైతులు ధర్నా చేసిన ఫలితం లేదు.

పెబ్బేరు మండలంలో..

మండలంలోని సూగూరులో హమాలీలు, లారీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రానికి 40 రోజుల క్రితం రైతులు 7 వేల బస్తాల దొడ్డు రకం ధాన్యం తెచ్చారు. అధికారులు కాంటాలు ప్రారంభించి చేతులు దులిపేసుకున్నారు తప్పా.. ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు ధాన్యం కాపాడుకోలేక ఎంత తరుగు తీసిన సరే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు నిర్వాహకులనే వేడుకుంటున్నారు. అధికారులు స్పందించి లారీల సమస్య పరిష్కరించి, ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



జానంపేటలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

మండలం	సేకరించిన ధాన్యం (బస్తాలు)		మిగులు ధాన్యం (బస్తాలు)
	ఐకేపీ	సింగిల్‌విండో	
శ్రీరంగాపురం	15,391	22 వేలు	లక్ష
పెబ్బేరు	53,852	1.63 లక్షలు	1.5 లక్షలు
వనపర్తి	1.16లక్షలు	2.56 లక్షలు	40 వేలు

40 రోజులుగా కేంద్రంలోనే..

ధాన్యం అమ్ముకోవడానికి 40 రోజులుగా కేంద్రంలోనే నిరీక్షించాల్సి వస్తోంది. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయింది. కేంద్రాల వద్ద రైతులకు కవర్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

– సహదేవుడు, కొత్తసూగూరు,పెబ్బేరు

ధాన్యం తడిసింది


20 రోజల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చిన. అప్పటి నుంచి కాంటా వేయలేదు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ధాన్యం తడిసింది. మబ్బులకు ధాన్యం ఆరడం లేదు. తడగిసిన దాన్యాని కొనుగోలు చేయ్యాలి.

– దండు వెంకటయ్య, సూగూరు, పెబ్బేరు

తీవ్ర నష్టం

కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 28 రోజులు అవుతుంది. దొడ్డు రకం వడ్లు అని ఎవరు కాంటా వేయడం లేదు. ఆదివారి రాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ఒక వైపు ధాన్యం సేకరించక రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉంటే మరోవైపు అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిలితుంది.

– పార్వతమ్మ, జానంపేట, శ్రీరంగాపురం



సూగూర్‌లో మొలకెత్తిన ధాన్యం

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలోని వెంకటగిరి క్షేత్రం నందు వెలిసిన శ్రీభూలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం వైభగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తి విగ్రహాలకు అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవానికి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శ్రీభూలక్ష్మీవేంకటేశ్వరస్వామి దంపతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి గోవింద నామస్మరణంతో ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు సింగరా ఆచార్యులు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాసులుశెట్టి, నర్సింహారావు దంపతులు, వెంకటేష్‌నాయక్, టీచర్ రామసుబ్బారెడ్డి దంపతులు, యాదగిరి దంపతులు, సంద వెంకటేష్, బలరాం, నరేష్‌కుమార్, అనిత, బీమా సునీత తదితరులు పాల్గొన్నారు.



భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పద్య కవికి సన్మానం

వనపర్తి టౌన్: ఐదు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి తన వంతుగా సేవలందిస్తున్న పద్య కవి సందాపురం బిచ్చయ్యను సోమవారం సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వృత్తిరీత్యా హిందీ భాషోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన సందాపురం బిచ్చయ్య ప్రవృత్తిగా తెలుగు సాహిత్య పద్యకవిగా యాభై సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ హిందీ భాషా బోధనలో విద్యార్థులకు చక్కటి పాఠ్య బోధన చేసిన ఆయన తెలుగు సాహిత్యంపై కూడా అభిమానం పెంచుకొని దాదాపు ముప్పై శతకాలు, ఇతర గ్రంథాలను వెలువరించారన్నారు. అనేక స్వచ్ఛంద సాహిత్య సంస్థలతో పాటు హైదరాబాద్ తెలుగు విశ్వ విద్యాలయం వారు గతేడాది విశిష్ట పురస్కారం అందజేశారన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కందూరు నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, డా బి శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సురేష్, రాము తదితరులు ఉన్నారు.



బిచ్చయ్యను సన్మానిస్తున్న సాహితి కళావేదిక ప్రతినిధులు

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, గణితం, ఇంగ్లిష్, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులతో పాటు ఎఫ్ఎల్ఎన్‌పై కూడా శిక్షణ ఉంటుందన్నారు. ప్రాథమిక విద్య పూర్తియ్యే సరికి ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలో నైపుణ్యాలు సాధించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కావాలన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులకు సులభతరంగా విద్య నేర్పేందుకు అవలంబించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాధికారి నర్సింహులు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం నుంచి 24వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శిక్షణకు ఎల్ఎఫ్ఎల్ హెడ్ మాస్టర్లు, ఎస్జీటీ ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రైతు నేస్తంలో పాల్గొనండి

వీపనగండ్ల: వానాకాలం పంటల సాగు, యాజమాన్య పద్ధతులు అనే అంశంపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రస్థాయిలోని శాస్త్రవేత్తలు ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు కొనసాగిద్దాం

వనపర్తిటౌన్: పేదల కోసమే జీవించిన మహోన్నతమైన మనిషి పుచ్చలపల్లి సుందరయ్య అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాంప్రకాశ్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుచ్చలల్లి సుందరయ్య కమ్యూనిస్టు గాంధీగా చిరస్థాయిగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో భూరోజు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, రమణయ్య, కరుణాకరశెట్టి, రవీందర్‌రెడ్డి, రాణాప్రతాప్ సింగ్, రాంబాబు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, వెంకటయ్య, కొండన్న, నెల్లూరు కురుమన్న, నరసింహ, కురుమన్న, బుచ్చన్న, పెద్దరాజు, సుశీల, మన్నెమ్మ, సుగుణమ్మ, భాగ్యమ్మ, శిరీష, దివ్య పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు తెల్లరాళ్లపల్లి తండాలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్, శాంతమ్మ, భీమయ్య, రాము, చిట్టెమ్మ, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, అజయ్, వెంకటేష్, శ్యాంసుదర్, బుచ్చన్న, భక్తరాజ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని గుంటిపల్లిలో పుచ్చపల్లి సుందరయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఉపాధి కూలీలతో కలిసి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు నివాళులర్పించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, సీహెచ్ వెంకటయ్య, బాలస్వామి, ఆశన్న, ఈశ్వర్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లగౌడ్, చంద్రయ్య, ఆంజనేయుడు, తిరుతపయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు, చెన్నయ్య, చిరంజీవి, మాసన్న, సుధాకర్, రాజు, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తదితరులు ఉన్నారు.



గుంటిపల్లిలో పుచ్చపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



పాన్‌గల్‌లో..



కొత్తకోటలో..



అమరచింతలో..

సేంద్రియ వ్యవసాయంతో భూ సారం మెండు

వనపర్తి రూరల్: భావితరాలకు సైతం భూమి ఉపయోగపడి, పంటలు పండాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలని శాస్త్రవేత నాగిరెడ్డి, విజయలక్ష్మి రైతులకు సూచించారు. పెబ్బేరు మండలంలోని శాఖాపూర్.వై రైతువేదికలో సోమవారం రైతు ముగిట్లో శాస్త్రవేతలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో విత్తనాల ఎంపిక, పంటమార్పిడి, ఎరువులు, యాంత్రీకరణ, వేరుశనగ, మినుము పంటల సాగుపై సూచనలు ఇచ్చారు. ఆయిల్‌పామ్ పంట సాగు లాభాల గురించి వివరించారు. ప్రతి సంత్సరం డీఏపీ, యూరియా వంటి రసాయనిక ఎరువులు వాడుతూ పోతే అనతి కాలంలోనే భూమి నిస్సత్తువగా మారి, చవట నేలగా మారి పోతుందన్నారు. పంట వేసే 45 రోజుల ముందు జీలుగ, పచ్చరొట్ట, పెసర, జనుము వంటి పంటలు సాగు చేసి వాటిని భూమిలో దుక్కడం వల్ల సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలిపారు. దీనితో పాటు పశువుల ఎరువు వాడటం వల్ల అధిక దిగుబడి రావటమే కాకుండా భూమి సారవంతంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ మున్నా, పశువైద్య అధికారి విజయ్‌కుమార్, ఏఈఓలు చక్రవర్తి, ఆంజనేయులు, రజిత, మాజీ వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, విండో ఉపాధ్యక్షుడు జక్కుల ఆంజనేయులు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్త

మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌లో జాప్యం జరగొద్దు

వనపర్తి: జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించే లారీలను మిల్లుల వద్ద ఎక్కువ సమయం నిలపకుండా వేగంగా దించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లుతో కలిసి రైస్‌మిల్లు అసోసియేషన్ సభ్యులతో, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత మిల్లులు, గోదాంలకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్టేషన్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తేమ, తాలు పేరుతో తరుగు తీస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులకు వేగంగా నగదు జమ అయ్యేవిధంగా అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. టెండర్‌లో ప్రతిపాదించిన విధంగా లారీలను అందుబాటులో ఉంచాలని, అందుకు విరుద్ధంగా వాహనాలు బయట తిరిగితే చర్యలు తీసుకోవాలని డీటీవోను ఆదేశించారు. లేబర్ సమస్య విషయంలో జిల్లా లేబర్ అధికారిని సంప్రదించి పరిష్కారం అయ్యే విధంగా ముందుకెళ్లాలన్నారు. మిల్లర్లు తమ సొంత వాహనాలు ఉంటే ధాన్యం రవాణాకు వినియోగించాలని కోరారు. సమావేశంలో పౌరసరఫరాల డీఎం జగన్‌మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్, మార్కెటింగ్ అధికారి, రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

గణితంపై 'పది' విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో గణితం పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు శిక్షణ అందించి పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గణితంలో ఫెయిలైన విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మెలకువలు అందించారు. చిక్కేపల్లి ఉన్నత పాఠశాల జీహెచ్ఎం, గణితం ట్రైనర్ శివయ్య, గణితం ఫోరం జిల్లా అధ్యక్షుడు, పాన్‌గల్ బాలుర జీహెచ్ఎం విజయ్, కదిరెపాడు ఉన్నత పాఠశాల జీహెచ్ఎం కృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయులు వెంకటేష్‌యాదవ్, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు



బండపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు తడవకుండా కవర్లు కప్పిన దృశ్యం



గోప్లాపూర్‌తండాలో ధాన్యం బస్తాల నిల్వలు

పాన్‌గల్: రైతులు తాము పండించిన ధాన్యం విక్రయించేందుకు అవస్థలు పడుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, కాంటా, ధాన్యం బస్తాల తరలింపులో జరుగుతున్న జాప్యం, అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి నాన అవస్థలు పడుతున్నారు. మండలంలో సోమవారం వరకు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23 కొనుగోలు కేంద్రాల్లో 20 వేలకు పైగా ధాన్యం బస్తాల నిల్వలు కేంద్రాల్లోనే ఉన్నాయి. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 కొనుగోలు కేంద్రాల్లో 2 వేలకు పైగా ధాన్యం బస్తాల నిల్వలు ఉన్నట్లు ఆధికారులు చెబుతున్నారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం కాంటా చేసి పది రోజులు అవుతున్నా ధాన్యం బస్తాల నిల్వలు తరలించడంలో జాప్యం జరుగుతుందన్నారు. మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన నాయకులు చెప్పిన కొనుగోలు కేంద్రాలకే లారీలు పంపుతున్నారని, సాధారణ రైతుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారని అన్నదాతలు వాపోతున్నారు. ఈ విషయంపై సింగిల్‌విండో సీఈఓ భాస్కర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. లారీలు రావడంలో జాప్యం జరుగుతుండటంతోనే ధాన్యం బస్తాల నిల్వల తరలింపులో జాప్యం జరుగుతుందన్నారు. విషయాన్ని మరోమారు జిల్లా అధికారులకు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

'వంతెన నిర్మాణం పూర్తి చేయాలి'

మదనాపురం: మండల కేంద్రం సమీపంలో గల ఊకచెట్టు వాగుపై గల వంతెన నిర్మాణానికి 9 ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తి కావడం లేదని, గతేడాది వాగు ఉధృతికి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని సోమవారం ఆర్టీఐ యాక్టివ్ ఫోరం నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్షాకాలంలో ఊకచెట్టి వాగుకు వరద వచ్చినప్పుడు వంతెనపై వరద నీరు ప్రవహిస్తోందని, దీనివల్ల వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతాయని, ఆత్మకూర్, అమరచింత, నారాయణపేట, చిన్నచింతకుంట, మరికల్, కొత్తకోట, మహబూబ్‌నగర్, మదనాపురం మండలాల్లోని ప్రజలకు జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయని వివరించారు. 2017లో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా.. పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయని వాపోయారు. సాధారణంగా వర్షాకాలంలో సరళాసాగర్ ప్రాజెక్టు నిండి సైఫన్లు తెరుచుకోవడంతో పాటు కానాయపల్లి శివారులోని శంకరసముద్రం రిజర్వాయర్ నీటి ఉధృతి కారణం ఊకచెట్టు వాగుపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని కలెక్టర్‌కు విన్నవించారు. వంతెన నిర్మాణం పూర్తయితే 30 గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ యాక్టివిటీస్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జి.రవికుమార్, కోశాధికారి మహేందర్, మండల అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీఐ యాక్టివ్ ఫోరం సభ్యులు

రూ.3 లక్షల విరాళం

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ ఆలయాల నిర్మాణం, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనకు మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.3,00116 నగదును నిర్వాహకులకు అందజేశారు. సోమవారం స్థానిక ముదిరాజ్ కమ్యూనిటీ భవనంలో సమావేశమైన మత్స్యకారులు ఆలయాల పునర్నిర్మానం కోసం విరాళం అందించారు. అలాగే తెలుగు సీతన్న 101 సిమెంటు బస్తాలు, వాకిటి పరశురాం రూ.10116 అందజేశారు. జూన్ 3 నుంచి 5 వరకు గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం ప్రముఖ వేదపండితుల మంత్రోచ్చరణలతో జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, ఆనంద్, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న మత్స్యకారులు